విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శనివారం 03 ఆగస్టు 2024 8 పేజీలు

బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలిద్దాం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపు
- బాల కార్మికుల నిర్మూలన ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలో బాల కార్మికులు అనేది లేకుండా నిర్మూలించడానికి జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్ నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలో బాల కార్మికుల నిర్మూలనపై ఆగష్టు 1 నుండి 31 వరకు జిల్లాలో నిర్వహించే ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, జిల్లాలో బాల కార్మికులు అనేది లేకుండా చేయడానికి జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేసి ప్రకాశం జిల్లాను బాల కార్మికుల రహితగా చేయాలన్నారు. జిల్లాలో ఆగష్టు 1 నుండి 31 వరకు జిల్లాలో బాల కార్మికుల నిర్మూలనకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా బాల పనిచేస్తుంటే వారిని ఆ పని నుండి విముక్తులు చేసి వారిని పాఠశాలలో చేర్పించాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. డ్రైవ్ నిర్వహించి బాల కార్మికుల ను విముక్తి కలిగించిన వారు అందరూ బడికి వెల్లుతున్నారా లేదా అని మళ్ళీ ఒక్కసారి సంబందిత అధికారులు పరిశీలించాలన్నారు. 14 సంవత్సరాలలోపు పిల్లలందరూ బడిలో ఉండాలని పనిలో కాదన్నారు. బాలలను పనిలోకి పంపించడం నేరమవుతుందని, బాలలను బడికి పంపించాలని వారి తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. ప్రభుత్వాలు పిల్లల చదువు కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తుందన్న విషయాన్ని పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. ఆగస్టు 1 నుండి ఆగస్టు 31 వరకు జిల్లాలోను మరియు మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఐసిడిఎస్, పోలీస్, మెడికల్ తదితర శాఖల అధికారులు, సమన్వయం చేసుకొని మండల స్థాయిలో కూడా బాల కార్మిక నిర్మూలనపై క్షేత్రస్థాయిలో పర్యటించి, బాల కార్మికులను, బడి మానివేసిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడంతో పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ ఉప కమీషనర్ గాయత్రి దేవి, ఐసిడిఎస్ పిడి మాధురి, జిల్లా విద్యా శాఖాధికారి సుభద్ర పాల్గొన్నారు. అనంతరం బాల కార్మికుల నిర్మూలనపై చేపట్టనున్న ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా జెండా ఊపి ప్రారంభించారు.

సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలి

- వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని, పశ్చిమ ప్రాంత ఆశాజ్యోతి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తిచేసి ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ త్రిపురాంతకం మండలం కార్యదర్శి బాణాల రామయ్య అధ్యక్షత వహించారు. ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఊహించన విధంగా కూటమికి 164 సీట్లతో నూతన ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రజలు చాలా ఆశలు పెట్టుకొని చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేశారన్నారు. చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఆమోదించి ప్రజలు ఓట్లు వేశారన్నారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం మూడవసారి అధికారం చేపట్టింది. ఈ సందర్భంగా మన రాష్ట్ర అభివృద్ధికి మంచి అవకాశం వచ్చింది. కేంద్ర ప్రభుత్వం

మిగతా 2 లో ...

ప్రభుత్వ భూములు, కరకట్టలు ఆక్రమణ

- నిద్రావస్తలో అధికారులు
- ఆర్డీవో విచారణ తరువాత ఫెన్సింగ్ ఏర్పాట్లు
- వీఆర్వోకు షోకాజ్ నోటీసుతో సరి

విశాలాంధ్ర - వేటపాలెం : మండలంలో ప్రభుత్వ భూములు, కరకట్టలు భూకబ్జాలకు పాల్పడుతున్నా రెవెన్యూ, డ్రైనేజీ శాఖలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. వేటపాలెం స్ట్రైట్ కట్, కరకట్టలు ఆక్రమణలకు గురయ్యాయని గత సోమవారం జిల్లా కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు అందిన మేరకు వేటపాలెంలో పలు భూకబ్జాలు ఆక్రమణలను చీరాల ఆర్డీవో వేటపాలెం తహసీల్దారు, సిబ్బందితో ఫీల్డ్‌కి వెళ్లి పరిశీలించిన అనంతరం వీఆర్ఓకు షోకాజ్ నోటీస్‌తో సరిపెట్టారు. ఈరోజు

మిగతా 2 లో ...

రైతన్న కల సాకారం

- ఎనిమిది దశాబ్దాల ఇనాం భూముల సమస్యకు పరిష్కారం
- గ్రామాల్లో పర్యటించిన జేసీ సుబ్బారావు

విశాలాంధ్ర - యద్దనపూడి :
పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో నియోజకవర్గంలో ఎనిమది దశాబ్దాలుగా నోచుకోని ఇనాం భూముల సమస్యకు పరిష్కారం లభించింది. పర్చూరు నియోజకవర్గంలోని సుమారు 2500 ఎకరాల ఇనాం ఎస్టేట్ భూముల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఏలూరి చూపిన చొరవతో రైతులకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎమ్మెల్యే ఏలూరి కృషితో రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తుంది. పర్చూరు నియోజకవర్గంలోని పర్చూరు మండలం ఏదుబాడు, చెన్నుం బొట్లవారిపాలెం, మార్టూరు మండలంలోని లక్కవరం, జంగమహేశ్వపురం గ్రామాలలో రైతులు గత 80 సంవత్సరాలుగా ఈనాం ఎస్టేట్ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులు సాగు చేసుకుంటున్న ఇనాం భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు, ఇతర యాజమాన్య హక్కు పత్రాలు కానీ లేకపోవటం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పరంగా అందించే ఎటువంటి సంక్షేమ పథకాలు, సబ్సిడి పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకులలో వ్యవసాయానికి అవసరమైన రుణాలు మంజూరు కాక పెట్టుబడులకు సరైన సమయంలో నగదు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి సమస్యను స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రెవిన్య మంత్రి అనగాని సత్యప్రసాద్‌ల దృష్టికి తీసుకువచ్చారు. అర్హులైన రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని 80 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపాలని వేలాది మంది రైతులకు ప్రయోజనం కల్పించాలని ఎమ్మెల్యే కోరారు.

'ఏలూరి' వినతితో స్పందించిన ప్రభుత్వం :
ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లేఖలతో ముఖ్యమంత్రి చంద్రబాబు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాదులు స్పందించారు. వెంటనే సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. స్పందించిన ప్రభుత్వం జిల్లా కలెక్టర్ వెంకట మురళి, జిల్లా జాయింట్ కలెక్టర్ సుబ్బారావులను చర్యలు తీసుకునేలా ఆదేశించింది.

వెంటనే జిల్లా జాయింట్ కలెక్టర్ సుబ్బారావు ఆయా గ్రామాలలో పర్యటించారు. ఆయా గ్రామాల రైతులు ఎదుర్కొంటున్న సమస్యను అడిగి తెలుసు కున్నారు. ఆయా మండలాల తహసీల్దార్లతో రైతుల సమక్షంలో పైళ్లను పరిశీలించారు. ఆయా భూములకు సంబంధించి రైతులకు హక్కుదారు పట్టాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

- ఏళ్ల నాటి సమస్యకు..
చరిత్రలో నిలిచేలా ఏలూరి పరిష్కారం
ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి

మిగతా 2 లో ...

రైతు ఆర్థికాభివృద్ధికి ఆపరేషన్ గ్రీన్స్ పథకం అమలుపై మాగుంట ప్రశ్న

విశాలాంధ్ర-ఒంగోలు : దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరగా పాడైపోయే 22 పంటలకు రైతుల ఆర్థిక స్తోమతు పెంపునకు, ఉత్పత్తుల నష్టాలు తగ్గింపునకు కేంద్రం అమలుచేయుచున్న ఆపరేషన్ గ్రీన్స్ పథకం క్రింద గత 5 సంవత్సరాలలో లబ్ధిపొందిన రైతులు, టమాటో, ఉల్లి, పుర్లగడ్డ మరియు తదితర 22 త్వరగా పాడై పోయే పంటల రేట్లపై ప్రభావం, ధరల నియంత్రణకు చర్యల మరియు ఖర్చుచేసిన నిధుల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. దీనికి కేంద్ర ఆహార తయారీ పరిశ్రమల శాఖ సహాయక మంత్రి రావ్ నీత్ సింగ్ సమాధానమిస్తూ టమాటో, ఉల్లి, పుర్లగడ్డ మరియు తదితర 22 త్వరగా పాడై పోయే పంటలకు సంబంధించి రైతుల ఆర్థిక స్తోమతు పెంపుకు మరియు ఉత్పత్తుల నష్టాలు తగ్గింపుకు పి.యం.కిసాన్ సంపద యోజన కార్యక్రమం క్రింద ఆపరేషన్ గ్రీన్స్ పథకాన్ని 2018-19 నుండి కేంద్రం 2 భాగాలుగా అమలుచేయుచున్నదని, దీర్ఘకాలిక భాగం క్రింద అర్హతగల పంటల కొరకు అమలుచేయుచున్న 52 ప్రాజెక్టుల క్రింద దేశం మొత్తంలో 3,38,074 మంది రైతులు లాభపడగలరని మరియు ఆంధ్రప్రదేశ్ లో 77,140 మంది లాభపడగలరని, స్వల్పకాలిక భాగం క్రింద రూ. 119 కోట్లు సబ్సిడీ మంజూరుచేయగా దేశంలో 31,364 మంది రైతులు వారి ఉత్పత్తుల నిల్వ, రవాణాలకు లాభపడగలరని తెలిపారు.

ఈ పథకంలో దీర్ఘకాలిక భాగం క్రింద టమాటో, ఉల్లి, పుర్లగడ్డ నుండి త్వరగా పాడై పోయే 22 పంటలకు కూడా విస్తరించబడిందని, దీంతో ఆహార తయారీ మరియు మౌలిక సదుపాయాలు సృష్టించడంతోపాటు, దొంగ నిల్వలు అరికట్టబడునని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచుటకు "ధరల స్థిరీకరణ నిధి పథకాన్ని" 2014-15 నుండి ప్రభుత్వం రూ.27,489 కోట్లతో అమలుచేయుచున్నదని తెలిపారు. ఈ పథకం క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 3 మామిడి ప్రాజెక్టులు, 1 టమాటో ప్రాజెక్టు, 12 రొయ్యలు ప్రాజెక్టులు మొత్తం 16 ప్రాజెక్టులు అమలగుచుండగా, దేశంలో మొత్తంలో పలు పంటలకు 36 ప్రాజెక్టులు అమలగుచున్నాయని తెలిపారు.ఉల్లి ధరలలో అస్థిరత ఏర్పడినపుడు, ఈ పథకం క్రింద రైతుల వద్ద పెద్ద ఉల్లి కొని -నిల్వచేసి, మార్కెటుకు సరుకు రాని నెలలలో ప్రజలకు సరఫరా చేయబడునని కేంద్ర మంత్రి తెలిపారు.

ఎస్సై సేవలు భేష్

విశాలాంధ్ర-మద్దిపూడి : మండల ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదుల మీద తక్షణం స్పందించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న మద్దిపూడి ఎస్సై శివ బసవరాజుకు జిల్లా ఎస్పీ వి ఆర్ దామోదర్ గురువారం ప్రశంసాపత్రం అందించారు. ఇటీవల జిల్లా ఎస్పీ దామోదర్ జిల్లా వ్యాప్తంగా తనిఖీలో భాగంగా మద్దిపూడి పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు సేవలు అందించటం, స్టేషన్ వాతావరణం ఆహ్లాదకరంగా శుభ్రంగా ఉండటం తదితర అంశాలను పరిశీలించిన ఎస్పీ ఎస్ఐ శివ బసవరాజుకు ప్రశంసా పత్రాన్ని అందించారు. ఎస్ఐకి ప్రశంసాపత్రం దక్కటం మండల ప్రజల సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మాదిగల చిరకాల స్వప్నం సాకారం

విశాలాంధ్ర-గిద్దలూరు : మాదిగల చిరకాల స్వప్నం గురువారం నెరవేరింది అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూలుగుజ్జు ఫ్రాంక్లిన్ మాదిగ అన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఎన్నో అవమానాలకు గురి అవుతూ కనీసం కులం పేరు చెప్పుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడుతున్న తరుణంలో మంద కృష్ణ 1994 సంవత్సరం రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించి యస్.సి.లకు కూడా బి.సి.ల్ వలె ఎ.బి.సి.డి.వర్గీకరణ చేయాలని ప్రభుత్వాల మీద అనేక పోరాటాలు చేసి అంతిమంగా భారత దేశ ధర్మాసనమైన సుప్రీంకోర్టు ఎస్సీల వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అంటూ వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉంటుందని ఒక చరిత్రాత్మకమైన తీర్పును ఇచ్చిన నేపథ్యంలో మందకృష్ణ మాదిగ30 సంవత్సరాల పోరాట ఫలితంగా ఎన్నో అడ్డంకులను అధిగమించి ఎంతోమంది మాదిగ అమరవీరుల త్యాగాల ఫలితంగా న్యాయమైన డిమాండ్ సాధన జరిగిందన్నారు. మాదిగ జాతి చిరకాల ఆకాంక్ష అయి నటువంటి ఎస్సీల వర్గీకరణ సాధించి పెట్టినటువంటి మాదిగ జాతి మహాత్ముడు సామాజిక న్యాయ పితామహుడు గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగకి కృతజ్ఞతలు తెలియజేస్తూ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు గుర్రం బాబురావు మాదిగ, కొండేపోగు దేవ ప్రభాకర్ మాదిగ, బొప్పూరి ప్రసాద్ మాదిగ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షులు కొమ్మునూరి వెంకటేష్, కార్యదర్శి బొమ్ము బాలు మాదిగ సీనియర్ నాయకులు పందిటి రజనీ కుమార్ మాదిగ, చెరుకుపల్లె లక్ష్మయ్య మాదిగ, కువ్వారపు శ్యాంబాబు మాదిగ, బైనాగారి ప్రభాకర్, వినుకొండ చిన్న, కొమ్మునూరి ఓబయ్య, సుధాకర్, సుందర రావు, బైనగారి మధు, కొమ్మునూరి ఎలీషా, గుర్రం ప్రసాద్, కృపయ్య, రాజు, దుగ్గెపోగు రామయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు, కరకట్టలు ఆక్రమణ

(మొదటిపేజీ తరువాయి)

వరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం రెవెన్యూ అధికారులు బదిలీలు జరుగుతూ ఉండటంతో భూకబ్జాదారులకు ఉత్సాహం ఉపందుకుని ఆక్రమణలకు ఇనుపకంచెలతో ఫెన్సింగ్ పూర్తి చేసుకుంటున్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు చట్టపరమైన చర్యలు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారు.డ్రైనేజీ అధికారులు సిబ్బంది లేరు అనే సాకుతో కనీసం పర్యవేక్షణ కూడా చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. గతంలో రిటైర్డ్ అయిన తహసిల్దారులను అడ్డం పెట్టుకుని స్థానిక వీఆర్వో సహకారంతో కరకట్టలు, పోరంబోకు, సొసైటీ భూములు ఆక్రమణలు చేసి అక్రమంగా మట్టి తరలిస్తున్నప్పటికీ రెవిన్యూ, డ్రైనేజీ శాఖల అధికారులు పట్టినట్టు వ్యవహరించడంపై స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేటపాలెం మండలం నాయినపల్లి సర్వే నెంబరు 514లో సుమారు ఒకటిన్నర ఎకరం భూమిని ఆక్రమించి ఇనుపకంచెలతో ఫెన్సింగ్ వేస్తున్న విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి స్థానికులు తీసుకువెళ్లినప్పటికీ ఈరోజు వరకు స్పందించకపోవడం రెవెన్యూ అధికారుల పనితీరుపై అనేక అనుమానాలకు తావిస్తోంది.

నూతన క్రూర చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలి

న్యాయవాది గోవిందయ్య

విశాలాంధ్ర-ఒంగోలు : 2024 జూలై 1 నుండి భారత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త నేర చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఓపిడిఆర్, ప్రజాతంత్ర మేధావుల వేదిక డిమాండ్ చేశాయి. స్థానిక ఈమనిపాలెం తరిమెల నాగిరెడ్డి భవన్ లో కొత్త నేర చట్టాలను నిరసిస్తూ జరిగిన సభలో ప్రజాతంత్ర మేధావుల వేదిక కన్వీనర్, ప్రముఖ న్యాయవాది పంగులూరి గోవిందయ్య మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంల పేరిట వచ్చిన చట్టాలు ప్రజల హక్కులకు, ముఖ్యంగా శ్రామిక, బలహీన వర్గాల ప్రజల హక్కులకు తీవ్ర విఘాతం కలిగించబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక మంది న్యాయ నిపుణులు వీటిని పాత సీసాలో కొత్త సారాగా వర్ణిస్తున్నప్పటికీ, న్యాయ, సురక్ష లాంటి పేర్ల చాటున పాలకులు పాత చట్టాలకు తెచ్చిన కొద్దిపాటి మార్పులే ప్రజలకు ముప్పుగా మారాయని, ఇలాంటి చట్టాలకు వ్యతిరేకంగా ప్రజాతంత్రవాదులందరూ గళం విప్పాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సభలో ఏఐఎఫ్‌టియూ (న్యూ) రాష్ట్ర కోశాధికారి కామ్రేడ్ డివిఎన్ స్వామి మాట్లాడుతూ భారతీయత పేరుతో తెచ్చిన ఈ చట్టాలు ప్రజా ఉద్యమాలకు, ప్రజల హక్కులకు భంగం కలిగిస్తుండగా, ఆరెస్సెస్ మతోన్మాద, హింసాత్మక కార్యకలాపాలకు చట్టబద్ధత కల్పించే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు, విచారణ, కేసు నమోదు, సోదా లాంటి అనేక విషయాల్లో ప్రజల హక్కులను కుదిస్తూ, పోలీసు వ్యవస్థకు అసాధారణ అధికారాలను ఇవ్వడం దేశాన్ని పోలీస్ రాజ్యంగా మార్చే కుట్రలో భాగమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

రైతన్న కల సాకారం

(మొదటిపేజీ తరువాయి)

నోచుకోని ఇనాం, ఎస్టేట్ భూముల సమస్యను అధికారంలోకి వచ్చినకూటమి ప్రభుత్వం నెలల కాలంలోనే పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే ఎవరు ప్రత్యేక కృషి చేశారు. స్వాతంత్ర్య పాలనలో పరిష్కారం కానీ ఈ సమస్యను పరిష్కరించేలా ఎమ్మెల్యే ఏలూరి చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని పలువురు పేర్కొంటున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఏలూరి వస్తున్న కృషి అమోఘం అంటూ కితాబిస్తున్నారు.

- 5010 ఎకరాలు,

2057 మంది రైతులు కల సాకారం

పర్చూరు నియోజకవర్గంలోని పర్చూరు మార్టూరు మండలాల పరిధిలోని ఏదుబాడు, చెన్నుంబొట్లవారిపాలెం, లక్కవరం, జంగ మహేశ్వపురం గ్రామాలలో సుమారు 5010ఎకరాలు ,2057 మంది రైతుల కల సాకారం కానుంది. చెన్నుంబొట్లవారిపాలెం 802.71 ఎకరాలు 320 రైతులు, ఏదుబాడు లో ఎస్టేట్ భూములు 1104.32 ఎకరాలు 430 మంది రైతులు ,లక్కవరం 565.ఎకరాలు, 386 మంది రైతులు, జంగమహేశ్వపురం 2539 ఎకరాలు 912 మంది రైతులు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. గత ఎనిమిది దశాబ్దాలుగా ఈనాం ఎస్టేట్ భూముల సమస్యను పరిష్కరించాలని రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కానీ అలాంటి ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల వ్యవధిలోనే ఎమ్మెల్యే ఏలూరి ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి మంత్రులతో తనకున్న సాన్నిహిత్యంతో సమస్యను పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపారు. పట్టు వదలని విక్రమార్కుడిలా ఎమ్మెల్యే వేలూరు చేసిన కృషికి ప్రభుత్వ యంత్రాంగం కదిలి వచ్చింది రైతన్నలకు బాసటగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తా

- జేసీ సుబ్బారావు

పర్చూరు నియోజకవర్గంలోని ఈనామ్ ఎస్టేట్ భూముల సమస్యను నెల రోజుల్లో పరిష్కరిస్తామని జేసీ సుబ్బారావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా మండలాల్లో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకుని ఎంక్వైరీ నిర్వహించినట్టు తెలిపారు. నెల రోజుల్లో రైతులందరికీ పట్టాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

విశాలాంధ్ర-సంతనూతలపాడు : తల్లిపాలు బిడ్డకు చాలా ఆరోగ్యకరమైన శ్రేష్టకరం అని ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాగలక్ష్మి పద్మ తెలిపారు. మండల కేంద్రమైన సంతనూతలపాడు వద్దెరపాలెం అంగనవాడి సెంటర్ నందు శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాగలక్ష్మి, పద్మ మాట్లాడుతూ తల్లిపాలు వ్యాధి నిరోధక మొదటి టీకా అని తెలిపారు. బిడ్డకు మొదటి ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలు ఇవ్వాలని వారు తెలియజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి తల్లుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఎల్ పద్మావతి ఏఎన్ ఎం కృష్ణవేణి అంగన్వాడి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సహకరిస్తుందని ఊహిస్తున్న నేపథ్యంలో 23వ తేదీన పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ను పరిశీలన చేస్తే మాటలు కోటలు దాటుతున్నాయి కానీ పని మాత్రం గడప దాటడం లేదు అన్న సామెతగా రుజువైందని అన్నారు. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలసీతం ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి 15 వేలు కోట్ల నిధులను వరల్డ్ బ్యాంక్ దగ్గర కేంద్ర ప్రభుత్వం హామీ ఉండి అప్పు ఇప్పిస్తాము. 30 సంవత్సరాలు పాటు నిదానంగా అప్పు తీర్చుకోమని చెప్పారని అన్నారు. వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాను చేర్చడం ఆనందదాయకమైన విషయమని తెలిపారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చాలి, జిల్లాను అభివృద్ధి చేయాలని అనేక పోరాటాలు అనేక కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిన్న బడ్జెట్ సందర్భంలో ప్రకాశం జిల్లాలో కూడా అందులో చేర్చటం ఆహ్వానించదగ్గ పరిణామమని తెలిపారు. ప్రకాశం జిల్లా అభివృద్ధికి ఏ రకమైన నిధులు ఇస్తున్నారనేది స్పష్టత ఇవ్వలేదని ఆయన అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బిజెపి నాయకులు ఆంధ్రప్రదేశ్ కు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల వరద ముంచేత్తుతుందని ప్రచారం చేయడమే తప్పా నిధులు ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. ఏమి సాధించారు ఏమి నిధులు వచ్చాయని ఈ సందర్భంగా తెలపమన్నారు. నేను అధికారంలోకి వస్తే అప్పులు తీసుకురావడం కాదు సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడుపుతానని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక హోదా అడగరు, ప్రత్యేక ప్యాకేజీ అడగరు మరి ఎక్కడి నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తాడని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు ఇంకా ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. భవిష్యత్తులో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చక పోతే గత ప్రభుత్వానికి ఏ రకమైన పరిస్థితి వచ్చిందో అదే పరిస్థితి మీకు వస్తుందని అన్నారు.

ఈ రాష్ట్రం లోటు బడ్జెట్ను పూడ్చుకోవడానికి కావలసిన నిధులు కోసం అఖిలపక్షాలను కలుపుకొని కేంద్ర ప్రభుత్వం దగ్గర పోరాటం చేసి సాధించుకోవాలి తప్పా ఏదో చప్పట్లు కొట్టడం ద్వారా గాని, అభినందనలు తెలియజేయడం ద్వారా గాని నిధులు సాధించుకోవడం సాధ్యం కాదని ప్రభుత్వ పెద్దలు గుర్తించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి జి గురునాథం, త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య, దోర్నాల మండల కార్యదర్శి విశ్వరూపాచారి, సీపీఐ నాయ కులు పూర్ణకంటి తిరుమలయ్య, నక్కా తిరుపతయ్య, నూర్జహాన్, సాంబశివరావు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు హర్షణీయం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యద్దనపూడి చిన్న విలీనం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కొనకనమిట్లలోని గుజ్జుల ఎల్లమందరెడ్డి స్మారకభవనంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి హర్షం తెలిపారు. సభలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు విలియం మాట్లాడుతూ రిజర్వేషన్లు వర్గీకరణ పై మంద కృష్ణ అన్న చేసిన 30 ఏళ్ల పోరాటానికి ఫలితం లభించిందని అన్నారు. వర్గీకరణ ఫలాలను అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో మాదిగ సోదరులు అభివృద్ధి చెందాలని కోరారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎం చిన్న కోటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు నిశనం డేవిడ్ మాట్లాడుతూమాదిగల ఎదుర్కొంటున్న సమస్యలపై అందరు ఐక్యంగా ఉండి పరిష్కరించుకోవాలని అన్నారు. వర్గీకరణ చేసేందుకు ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు రేవంత్ రెడ్డిలు సుము క తతెలపడంపై ఆనందం వ్యక్తం చేశారు. కృష్ణ అన్నకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు చిరుగురు రాజు, ఎస్సీ సెల్ నాయకులు సిహెచ్ కోటేశ్వరరావు, సిహెచ్ ఏసు కరుణయ్య, విజయ్, నాగయ్య, బుద్ధయ్య ,వెలుగొండయ్య రంగయ్య, చార్లీ ,పరుగు గ్రామాల ఎంఆర్పిఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

శివం ఫౌండేషన్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-చీమకుర్తి : అనారోగ్యంతో మంచం పట్టిన ఓ పేద కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక భరోసా కల్పించింది శివం ఫౌండేషన్. చీమకుర్తి విద్యానగర్‌కు చెందిన బందారు సుబ్బారావు ఆదిలక్ష్మి అనే వృద్ధ దంపతులలో ఒక్కరికి కూడా పెన్షన్ లేదు. సుబ్బారావు కంటి చూపు సక్రమంగా లేక ఆదిలక్ష్మి కీళ్లవాతంతో మంచానికే పరిమితం అయింది. అనారోగ్యంతో బాధపడుతూ సాయం చేయమంటూ శివం ఫౌండేషన్‌ని అభ్యర్థించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పూనాటి వెంకట్రావు చేతుల మీదగా 15 వేల రూపాయల ఆర్థిక సహాయం, మందులు అందజేశారు. శివం ఫౌండేషన్ ద్వారా ఆ వృద్ధ దంపతులకు ప్రతి నెల మందులకు అయ్యే ఖర్చు భరించేందుకు పూనాటి వెంకట్రావు గొప్ప మనసుతో ముందుకు వచ్చారు.ఆపదలో వారికి సాయం చేస్తున్న శివం ఫౌండేషన్ వారికి తను అన్ని విధాల సహకరిస్తానని,పేదలకు చేస్తున్న సేవా కార్యక్రమాల్లో తనను భాగస్వామ్యం చేసినందుకు పూనాటి వెంకట్రావు శివం ఫౌండేషన్ ఫౌండర్ గొల్లపూడి హరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పోకూరి ఆంజనేయులు, సి. హెచ్. తిరుమల, ఏ. గురవయ్య పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : నాగులుప్పలపాడు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 4న ఎంపీపీ నలమలపు అంజమ్మకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహాలక్ష్మి తెలిపారు. వివిధ శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరుకావాలని కోరారు. జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకానున్నట్లు తెలిపారు. ముందుగా ఈ నెల 5న జరుగుతుందని ప్రకటించినప్పటికీ, అనంతరం 4వ తేదీకి మార్పు చేశారు.

పూసలపాడులో పొలంబడి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : మండలంలోని పూసలపాడు గ్రామంలో శుక్రవారం వ్యవసాయాధికారి జక్కం మెర్సీ ఆధ్వర్యంలో కంది వేసిన రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందడమే పొలంబడి ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. మట్టి పరీక్షలు చేయడం వల్ల మట్టిలో ఉన్న పోషకాలను తెలుసుకోగలమన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నవీన్, రైతులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో సబ్ కలెక్టర్ తనిఖీలు

అడ్డుకునేందుకు టీడీపీ నేతల యత్నం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ఎర్రగొండపాలెంలోని రేషన్ షాపులపై మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా రాత్రి 10 గంటలకు దాటిన తర్వాత ఆకస్మిక దాడులు నిర్వహించారు. ముందుగా ఒక షాపు నెంబర్ 4ను తనిఖీ చేశారు. ఆ షాపులో రేషన్ పంపిణీ జరగలేదని స్టాక్ పూర్తిగా ఉన్నట్లు ఆయన గుర్తించారు. ఆ తర్వాత మరో మూడు షాపులను తనిఖీ చేశారు. పువ్వాడ శ్వేతకు సంబంధించిన 22వ నెంబర్ షాపు డీలర్ ఎంతసేపటికి స్పందించక పోవడంతో సబ్ కలెక్టర్ తన సిబ్బందితో ఆ షాపు తాళాలు పగలగొట్టించి తనిఖీ చేశారు. అందులో 5608కిలోల బియ్యంకు గానూ 4390కిలోల బియ్యం మాత్రమే పంపిణీ జరిగినట్లు ఆయన గుర్తించారు. కేవలం టిడిపికి చెందిన డీలర్ల షాపులను మాత్రమే తనిఖీలు చేస్తున్నారని తెలుసుకున్న ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు అక్కడకు చేరుకుని నిద్రపోయే సమయంలో ఈ బలవంతపు తనిఖీలు ఎంటని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా తోపాటు వారి సిబ్బందిని అడిగారు. కేవలం తమ పార్టీ తరపున నిర్వహించే షాపులను మాత్రమే తనిఖీలు చేస్తూ తమ వారిని ఇబ్బందులు పెట్టడం సబబు కాదని యర్రగొండపాలెంలో ఉన్న వైసిపికి చెందిన షాపులను కూడా తనిఖీలు చెయ్యాలని పట్టు పడటంతో కొద్దీ సేపు అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. తమకు షాపులపై ఎటువంటి ఫిర్యాదులు రాలేదని మాములుగా జరిగే తనిఖీల్లో భాగంగానే రేషన్ షాపులను తనిఖీ చేస్తున్నామని ఇక్కడ ఉద్దేశ పూర్వకంగా ఏమి జరగడం లేదని ఆయన తెలిపారు. రేషన్ షాపులన్ని శుక్రవారం ఉదయం తనిఖీ చేస్తానని సబ్ కలెక్టర్ అక్కడినుంచి వెళ్లిపోయారు. ఆయన వెంట ఇంచార్జ్ తహశీల్దార్ విజయభాస్కర్, సీఎస్ గౌడౌన్ డీటీ తిరుపతిరెడ్డి ఉన్నారు.

మారం చిన్నపేరిరెడ్డి వర్ధంతి

విశాలాంధ్ర-చీమకుర్తి : మారం వెంకారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మారం చిన్నపేరి రెడ్డి 25వ వర్ధంతి కార్యక్రమంను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు బి.జవహర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి పాల్గొన్నారు. మొదటగా కార్యక్రమానికి హాజరైన అతిరథ మహారథులు అందరూ మారం చిన్న పేరి రెడ్డి చిత్ర పటానికి ఘనమైన నివాళులు అర్పించారు. అనంతరం సభా కార్యక్రమ నిర్వహించగా వక్తలు మాట్లాడుతూ మారం చిన్నపేరి రెడ్డి మరణించి 25 సంవత్సరాల అయినప్పటికీ మారం వెంకారెడ్డి ఫౌండేషన్ తరుపున ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండ వర్ధంతి, జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పలుసేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందాయకమైన విషయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 1000 మందికి దుప్పట్లు పంపిణి చేశారు.ఈ కార్యక్రమం లో జెడ్పిటిసి సభ్యులు వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, గంగిరెడ్డి సుందర రామిరెడ్డి, ఆముదలపల్లి రాంబ్రహ్మం, సోమా శేషాద్రి, బడే అయ్యప్ప రెడ్డి, పారిశ్రామికవేత్త మారం పురుషోత్తం రెడ్డి,జేవీసీ వ్యవస్థాపకులు పేరం శ్రీనివాసరావు,రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి అధ్యక్షులు కడవ రామకృష్ణారెడ్డి,రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు పోకూరి రామకృష్ణ రెడ్డి, గ్రామీణ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చింత క్రింది అశోక్ కుమార్,అంబటి వీరారెడ్డి మాస్టర్,ఎస్సీ నాయకులు బండ్ల కొండలరావు,కడియం అంజయ్య, పాటిమీదపాలెం యంగన్న, నెప్పల రమణయ్య, మార్కండేయ యువజన సంఘం అధ్యక్షులు పుత్తూరి ఆంజనేయులు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ ఆలపాటి నర సింహారావు, మాజీ కౌన్సిలర్ కోట రాములు,చింతపట్ల బ్రహ్మయ్య,దండు మధు సూదన్ రెడ్డి, బడే దశరథ రెడ్డి,వల్లక సురేష్ రెడ్డి,అన్నవరపు ప్రశాంత్, అంజి రెడ్డి, రవీంద్ర రెడ్డి, మారం వెంకా రెడ్డి యూత్ ఫోర్స్ పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం ఏర్పాటు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని బృందావనం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం తిది భోజనం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ(1) జె సుబ్బారావు తెలిపారు. బృందావనం గ్రామానికి చెందిన సామాజిక సేవ చేస్తున్న కాటూరి రత్నం ఒక రోజు భోజనంలో స్వీటు, హాట్,

పండ్లు, చికెన్, పాయసం వంటి ఆహారం అందించిన రత్నంను ఉపాధ్యాయులు అభినందించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న భోజనాన్ని మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని వంట నిర్వాహకులకు సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివి, సమాజంలో మంచి పౌరులుగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిహెచ్ జయరామిరెడ్డి, టీ శ్రీనివాసరావు, సిహెచ్ ఝాన్సీ, ఎస్ కే మీరావలి, సిహెచ్ భాగ్యలక్ష్మి, చెన్నూరు, అంటోని, వెంకటేశ్వర రెడ్డి, గురువారెడ్డి వెంకటేశ్వర్లు, సి ఆర్ పి మరియమ్మ పాల్గొన్నారు.

రైతులు ఉత్పత్తి సంఘాలలో చేరాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : రైతులందరూ ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా చేరి లాభం పొందాలని సిఎఫ్ ఓ(ప్రేరణ) ఆర్ నాగలక్ష్మి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏవో మహమ్మద్ ఫరూక్ తో శుక్రవారం సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా పసుపు గల్లులో ఎలైడ్ అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీని ఏర్పాటుకు చర్యలు తీసుకునేందుకు వ్యవసాయ శాఖ సహకారం అందించాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా పంటలు కొనుగోలు, అమ్మకాలు జరుగుతాయని అన్నారు. రైతులు సంఘాలలో చేరి ఆదాయం పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ బాల వెంకటయ్య, ఎంపీఈవో నరేంద్ర, అబ్దుల్ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో అరుదైన జీవి అలుగు (పంగోలిన్) లభ్యం

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : స్థానిక డాక్టర్ శ్యామ్యూల్ జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ప్రపంచంలో అంతరించి పోతున్న జీవులతో ఒకటైన అరుదైన జంతువు అలుగు పంగోలిన్ వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు తెలియచేసారు. కళాశాల లేడీస్ హాస్టల్ ఆవరణలో సంచరిస్తున్న ఈ అరుదైన జంతువును సిబ్బంది గుర్తించి అటవీ శాఖాధికారుల దృష్టికి తీసుకు రావడం జరిగింది అని వారు తెలియచేశారు. డీఎఫ్ఓ ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది కళాశాలకు చేరుకుని జంతువును పరిశీలించిన అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్యలు అలుగు పంగోలిన్‌ను సిబ్బందికి అప్పగించారు. ఇంతటి అరుదైన జీవి కళాశాల ఆవరణలోకి రావడం చాలా ఆనందంగా ఉందని ప్రపంచంలో అంతరించి పోతున్న ఇటువంటి జంతువును క్షేమంగా కాపాడి అధికారులకు సమాచారం అందించి అప్పగించిన సిబ్బందిని కళాశాల అధినేత మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మరియు డీఎఫ్ఓ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితోపాటు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

దాత బొమ్మిశెట్టి బాలాజీకి సత్కారం

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని గోకులం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సాఫ్ట్వేర్ డిజైనర్ ఉమ్మిశెట్టి బాలాజీ శుక్రవారం విద్యార్థులకు భోజనం ఏర్పాటు అంతేకాక సన్న బియ్యం కొరకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయ ఉపాధ్యాయురాలు ఏసమ్మ విద్యాశాఖ అధికారి 2 దేవి రెడ్డి రామిరెడ్డి చేతుల మీదుగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ 2 మాట్లాడుతూ పాఠశాలకు ఇటువంటి దాతలు ముందుకొచ్చి గ్రామస్థాయిలో పాఠశాలలు బలోపేతం కొరకు వారికి తోచిన సహాయ సహకారాలు అందించాలని ఆయన చూపించారు. ఈ కార్యక్రమంలో పావని రవికుమార్ నరసింహారావు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

విశాలాంధ్ర-ఒంగోలు : సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ సయ్యద్ షహనాజ్ ఆధ్వర్యంలో ఒంగోలు సూర్య శ్రీ ట్రస్ట్ కార్యాలయం నందు ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ సతీమణి సవిత ప్రారంభించారు. మండవ సవిత మాట్లాడుతూ మహిళలకు ట్రస్టులోని దివ్యాంగులకు ఈ ఉచిత టైలరింగ్ కేంద్రం ఉపయోగపడుతుందని వారు జీవనోపాధికి సహకరిస్తుందని తెలిపారు. మాజీమహిళా కమిషన్ సభ్యురాలు తమ్మిశెట్టి రమాదేవి మాట్లాడుతూ షహనాజ్ టైలరింగ్‌లో మంచి అనుభవం ఉండి ఉచితంగా మహిళలకు శిక్షణ ఇచ్చి వారి కుటుంబ అవసరాలకు జీవనోపాధికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని ఈ అవకాశాన్ని మహిళలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ మహిళా విభాగం నాయకురాలు వడ్డెంపూడి సుజాత కోసూరి శ్రీదేవి. షాబాన .లక్ష్మి. జయవర్ధని మరియు ట్రస్టులోని దివ్యాంగులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర-పుల్లలచెరువు : ఈ నెల 8వ తేదీన ఎస్ఎంసి ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ను గురువారం స్థానిక జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరరావు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గురువారం ఓటర్ జాబితా ప్రదర్శన ఈ నెల 5వ తేదీన ఓటర్ జాబితా పై అభ్యంతరాల స్వీకరణ ఫిర్యాదులుంటే పరిష్కరించటం. 8 వ తేదీన ఎన్నికల నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

విశాలాంధ్ర-పామూరు : చంటి బిడ్డల ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేష్టం అని ఎంపీపీ గంగసాని అన్నారు. తల్లిపాలు ప్రపంచ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో తల్లిపాలు ప్రాముఖ్యత గురించి తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని గంగసాని లక్ష్మీ మాట్లాడుతూ బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం వలన దృఢముగా ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. డబ్బా పాలు ఇవ్వడం వలన భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. కనిగిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని సరోజిని మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలే మొదటి టీకా అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించడం వలన బిడ్డ ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగ కరమన్నారు. తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి పుల్లారెడ్డి, సూపర్వైజర్స్ పద్మజ, పార్వతి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దర్శి అభివృద్ధి ధ్యేయం

నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

విశాలాంధ్ర-దర్శి : దర్శి అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లా అని చేర్చటంకు, అవసరమైన నిధులను మంజూరుకు కృషిచేసిన నాయకులు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి మన కూటమి ఎంపీల బృందానికి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ కడియాల లలిత సాగర్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి డాక్టర్ కడియాల లలిత్ సాగర్‌లు ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు. పార్టీ ఇన్చార్జిలుతో కలిసి ఢిల్లీ వెళ్లి నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 60 రోజుల్లో అనేక అద్భుతాలు సాధించామన్నారు. ముఖ్యంగా వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లా చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దర్శి నియోజకవర్గంలో అనేక ప్రాంతాలు వెనుకబడి కనీస వసుతులకు దూరంగా ఉన్నారని గొట్టిపాటి లక్ష్మి వివరించారు. వెనుకబడిన దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు మన ఎంపీ గారు మాగుంట శ్రీనివాసరెడ్డి సంపూర్ణంగా సహకరిస్తారని హామీ ఇచ్చారన్నారు. దర్శి అభివృద్ధికి వెనుకబడిన జిల్లాల లో ప్రకాశం చేరడం మనకు శుభ పరిణామం అని ఆమె అభిప్రాయపడ్డారు. మన ఎంపీ శ్రీనివాసరెడ్డితో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా దర్శి ప్రాంతంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు అవసరమవుతాయని అందుకు సంబంధించిన ప్రణాళికలు అధికారులు ద్వారా సిద్ధం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా ఫ్లోరైడ్ నివారణకు పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, జిల్లా ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య తదితరులు ఉన్నారు.

ఔషధ మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఔషధ మొక్కల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదని ఎంఈఓ (2) కే వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రమైన ముండ్లమూరులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాలలో శుక్రవారం 12 రకాల ఔషధ మొక్కలను జాతీయ ఔషధ మొక్కల బోర్డు ఆయుష్ మంత్రిత్వ శాఖ వారి సహకారంతో ఐ ఈ ఈ ఆర్టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 25 పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. అందులో భాగంగా శుక్రవారం పాఠశాలలో మొక్కలు నాటారు. ఔషధ మొక్కల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కిరణ్ చందు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఆయుర్వేదంలో నిష్ణాతులు అయినటువంటి వైద్యులతో ఉచితంగా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలందరిని కూడా ఆరోగ్యవంతులుగా చేయడమే లక్ష్యంగా ఐ ఈ ఈ ఆర్ టి ల లక్ష్యమని ఆయన అన్నారు. ఔషధ మొక్కలైన వేప. తులసి, అలోవెరా, అశ్వగంధ, బ్రహ్మ, ఉసిరి,తమలపాకు, ఎర్రచందనం. ఇన్సూరెన్స్ ప్లాంట్, రణపాల, నల్ల పసుపు. పుదీనా. సన్న, వంటి ఔషధ మొక్కల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కే పూర్ణచంద్రరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ మాధవి లత, కస్తూర్బా గాంధీ విద్యాలయ ఎస్ఓ ఏ సునీత, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో అనుబంధం

విశాలాంధ్ర-బేస్తవారిపేట : తల్లి పాలతో తల్లి, బిడ్డ అనుబంధం పెరుగుతుందని అంగన్వాడీ సూపర్ వైజర్ వి.గాలెమ్మ అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని చెరుకుపల్లి అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాన్పు అయిన గంట లోపు బిడ్డకు ముర్రు పాలు త్రాగించాలని, ముర్రు పాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని తెలిపారు. బిడ్డకు తల్లి పాలు దేవుడిచ్చిన వరమని, 6నెలల వరకు బిడ్డకు తల్లి పాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలు తాగడం వల్ల తల్లికి బ్రెస్ట్ కాన్సర్ రాకుండా ఉంటుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు సీహెచ్ విజయలక్ష్మి, ఐ. కవిత, సీహెచ్ మేరీ, ఎం. రూతమ్మ, డి. ఖాసీంబి తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్లలో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని వెలిగండ్ల పంచాయతీలో మెయిన్ రోడ్ లో ఉన్న కాలువ పూర్తిగా మురుగునీటితో నిండడంతో వర్షాభావం వల్ల దోమల ప్రబలి ప్రజలకు వ్యాధులు సంభవించే ప్రభావం ఉన్నందున స్పందించిన సర్పంచ్ వెంటనే మురుగు కాలవలను తీయించి ప్రజలకు ఇబ్బంది కలవకుండా చూసేందుకు సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు తన సిబ్బంది గ్రీన్ అంబాసిడర్లతో మరుగును శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్ రెడ్డి కేటీఆర్ నాయుడు మాజీ సర్పంచ్ మాణిక్యరావు బాలుడు బుజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

'పిడికిటి'కి నివాళులర్పించిన 'బొల్లా'

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని చిలంకూరు కు చెందిన పిడికిటి చిన్న వెంకటేశ్వర్లు మృతి చెందారు. శుక్రవారం ఈ విషయం తెలుసు కున్న టిడిపి నాయకులు ఎంపీటీసీ బొల్లా నరసింహారావు చిలమకూరు వెళ్లి వెంకటేశ్వర్లు భౌతిక కాయానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి, సుచ్చు పాద వైస్ సర్పంచ్ గోళ్ళ వెంకటేశ్వర్లు, గుత్తి మహేష్ మండ్ల రమణయ్య తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

విశాలాంధ్ర-దొనకొండ: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ప్రభుత్వ వైద్యురాలు సునీత తెలిపారు. స్థానిక బేతేలుపురం 2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు సునీత మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే మొదటగా వచ్చే ముర్రు పాలు తాగించటం వలన వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. తల్లులకు రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్ వంటివి రాదన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకి మరిచి పోకుండా తల్లులు వెంటనే పాలు పట్టించాలన్నారు. 1వ తేది నుంచి 7వ తేది వరకు జరుగు ఈ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో బాలింతలకు, గర్భవతులందరికి విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు సునీత తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త జయమణి, వైద్య సిబ్బంది ఇన్నాసమ్మ, రూతమ్మ, లీలాబాయి, ఆయా పద్మాబాయి, గర్భవతులు, తల్లులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉంటా...

ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నరేంద్ర వర్మని వారి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు నేరుగా కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ గత ఐదేళ్లు ఎలాంటి భరోసా లభించక సామాన్యులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారన్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక సతమతమయ్యారన్నారు. పెన్షన్‌ల కోసం వృద్ధులు, వికలాంగులు, మహిళలు, ఉద్యోగాల కోసం యువత, విద్య, వైద్య సాయం కోసం సామాన్యులు, తాము ఎదుర్కొంటున్న కష్టాల నుంచి గట్టెక్కేందుకు బాధితులు పెద్దఎత్తున తరలి వస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలకుల బాధితులే ఎక్కువమంది తమకు న్యాయం చేయా లని రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తి స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి ఆయా విభాగాలతో సమన్వ యం చేసుకుని వీలైనంత తొందరగా అందరి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ప్రజల అర్జీలు ఎంతమేరకు పరిష్కారం అయ్యాయి, వాటి స్టేటస్‌ను ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధి కారులు, సిబ్బందికి ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు.

భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలి : జేసీ

విశాలాంధ్ర-పర్చూరు: ఈనాం, ఎస్టేట్ భూములు కలిగిన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను సకాలంలో అందించాలని బాపట్ల సంయుక్త కలెక్టర్ (జేసీ)బి.సుబ్బారావు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. జేసీ సుబ్బారావు మాట్లాడుతూ మండలంలోని చెన్నుభోట్లవారిపాలెం గ్రామ పరిధిలో ఈనాం భూములు 802 ఎకరాలు ఉన్నాయని, ఎదుబాడులో ఎస్టేట్ భూములు 1104 ఎకరాలు ఉన్నాయని, మొత్తం వెయ్యి మంది రైతుల కుటుంబాలకు మేలు జరిగే విధంగా భూములకు దృవీకరణ పత్రాలు అందించాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు త్వరగా సమస్యను పరిష్కరించాలని తెలిపారు. భూముల వలన రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని, బ్యాంకులలో రుణాలు మంజూరు కావాటం లేదని, రిజిస్ట్రేషన్లుకు అనుమతి లేదని, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో భూముల సమస్య పరిష్కారం అవుతుందని రైతుల ప్రతినిధి మానం సాంబశివరావు తెలిపారు.

సంతమాగులూరు సీఐగా వెంకట్రావు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - బల్లికురవ : సంతమాగులూరు సర్కిల్ నూతన సీఐగా కె.వెంకట్రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ నరసింహారావు బదిలీపై వెళ్లగా గుంటూరులో సీఐ గా బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకట్రావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన సూచించారు. గ్రామాలలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

తహశీల్దార్‌గా శ్రీచరణ్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి మండలం తహశీల్దార్‌గా శ్రీచరణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తహశీల్దార్ శ్రీచరణ్ ప్రకాశం జిల్లా లింగం సముద్రం మండల తహశీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై బాపట్ల జిల్లా అద్దంకి మండలానికి తహశీల్దార్‌గా నియమింప బడ్డారు. ఇప్పటివరకు అద్దంకి తహశీల్దార్‌గా పనిచేసిన మహబూబ్ సుభాని గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్ళారు.

తహశీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్ల సంఘ సభ్యులు

విశాలాంధ్ర - కర్లపాలెం : కర్లపాలెం మండలం నూతన ఎమ్మార్వోగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.వెంకటరత్నంని శుక్రవారం ఆయన కార్యాలయంలో రేషన్ డీలర్ అసోసియేషన్ వారు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్స్ జిల్లా ప్రెసిడెంట్ సిహెచ్ వెంకటేశ్వరరావు,ఎం,పరమానంద కుమార్,వాకా శివశంకర్, ఎస్.శ్రీనివాసరావు, అట్లా గిరిరెడ్డి, రాజ్యలక్ష్మి, పి.శ్రీనివాసులు,ఏ.శ్రీనివాస్ రెడ్డి,ఎన్. యానాది, షబ్బీర్, మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య

విశాలాంధ్ర - బాపట్ల : తెలుగువారి కీర్తి ప్రతిష్టలను పెంచిన వ్యక్తి పింగళి వెంకయ్య అని ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు అన్నారు. పింగళి వెంకయ్య 148 జయంతి సందర్భంగా శుక్రవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వెంకయ్య విగ్రహానికి పూల మాలలు వేసే నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు పారిస్‌లో జరుగుతున్న విశ్వ క్రీడలలో తెలుగు వాడు రూపొందించిన త్రివర్ణ పతాకం రెప రెపలాడుతుందన్నారు. జాతీయ పతాకానికి రూపకల్పన చేసి తెలుగు వారి ఖ్యాతిని అంతర్జాతీయంగా పింగళి వెంకయ్య ఇనుమడింపజేశారన్నారు. మువ్వన్నెల జెండా తెలుగువారి ఘనతను చాటుతున్నదన్నారు. తెలుగు వారికి అంతరాజతీయ స్థాయిలో గౌరవ, ప్రతిష్టలను తీసుకువచ్చిన పింగళి చిరస్మరణీయులన్నారు. తెలుగువారికి తరతరాలకు తరగని పేరు,ప్రఖ్యాతులను ఆర్జించి పెట్టిన పింగళి రుణం మనం తీర్చుకోలేనిదన్నారు. జాతి అస్తిత్వానికి, మనుగడకు మూల మైన త్రివర్ణ పతాకాన్ని ఆయన మనకు అందించార న్నారు. ఎన్నో ఏళ్లు శ్రమించి, అనేక దేశాల జెండాలు పరిశీలించి మన దేశ జాతీయ పతాకాన్ని ఆయన రూపొందించారన్నారు. స్వాతంత్ర సమరంలో పోరాటానికి ఆ ఆయుధాన్ని మనకు అందించారన్నారు. 1913లో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభలో ఆయన పాల్గొనడం విశేషమన్నారు. ఈ కార్యక్ర ామంలో ఏవివి ఉన్నత పాఠశాల ఇన్చార్జి హెచ్.ఎం నాగేశ్వరరావు,ఉపాధ్యాయులు ఉమామహేశ్వర రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - అద్దంకి : రాష్ట్రంలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతి పత్రాలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులకు సంబంధించి వాటి పరిష్కారం కొరకు అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించారు.

ఘనంగా రవికుమార్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బీసీల సమస్యల పరిష్కరించే దిశగా పని చేస్తున్న రవి కుమార్ కృషి అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్ది బోయిన తాతయ్య పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ జన్మదిన వేడుకలు బాపట్ల జిల్లా కార్యదర్శి ఎన్‌ఎస్పి రాజు ఆదేశాలతో పట్టణ యువజన అధ్యక్షుడు ఉప్పలదీన్నే గోపి నాథ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస కాలనీ ఒకటో లైన్ ఎస్.ఎన్.పి మండల ఎడ్యుకేషన్ స్కూల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య విచ్చేసి కేక్ కట్ చేసి విద్యార్థులకు స్టేషనరీ కిట్లు పంపిణీ చేసి అనంతరం విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడు మాట్లాడుతూ బీసీలను ఐక్యత పరిచేందుకు కృషివల్యుడుగా నిలిచిన రవికుమార్ జన్మదిన వేడుకలు జరపడం చాలా ఆనందదాయకం అన్నారు. ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని,ఆయురారోగ్యాలతో ఉండాలని, బీసీలకు మరెన్నో సేవలు అందించాలని మనసారా కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మారం రవికుమార్,బాపట్ల నియోజకవర్గ మహిళా అధ్యక్షరాలు కంకణాల బాలమ్మ,పట్టణ యువజన నాయకుడు సిరిగిరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్స్ తొలగింపులను నిరసిస్తూ 5న కలెక్టరేట్ వద్ద ధర్నా : సీఐటీయూ

విశాలాంధ్ర - ఒంగోలు : రాష్ట్రంలో స్కీంవర్కర్స్ ,చిరు ఉద్యోగులపై వేదింపులు,తొలగింపులను నిరసిస్తూ ఆగస్ట్ 5న కలెక్టరేట్ వద్ద ధర్నాలో అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ ప్రకాశంజిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు,యం.రమేష్ స్కీం వర్కర్లకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్కీం వర్కర్లు, చిరుఉద్యోగులపై వేధింపులు పెరిగిపోయాయన్నారు. రాజకీయాలకతీతంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను, పాఠశాల పారిశుధ్య కార్మికులను, వి.ఓ.ఎ.ఫీల్డ్ అసిస్టెంట్లలను అధికారపార్టీ గ్రామ నాయకుల ఒత్తిడితో అదధికారులు నిబంధనలకు విరుద్ధంగా తొలగింపులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. చిరు ఉద్యోగులకు కనీసవేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్,ఉద్యోగ బధ్రత కల్పించాల్సిన ప్రభుత్వం స్కీంవర్కర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని పాలక పార్టీ గ్రామ నాయకులు విధులకు ఆటంకం కల్పించడంతో పాటు, చిప్పకూడు తినిపిస్తామని బెదిరిస్తుంటే జిల్లా అధికారులు శోధ్యం చూస్తున్నారన్నారు. ఈ పాటికే జిల్లాలో సుమారు 1000 మందికి పైగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులు,విఓఎఫీల్డ్ అసిస్టెంట్లు, మున్సిపల్ కార్మికులను తొలగించారన్నారు. అంగన్వాడీ ఆయాల ప్రమోషన్స్ వెనక్కి తీసుకోవాలని జిల్లా శాసనసభ్యులు ఒత్తిడిచేయడం వేదింపులు తీవ్రతకు నిదర్శనమన్నారు. స్వచ్ఛ భారత్ కార్మికులకు 30 నెలల నుండి ఇవ్వాల్సిన జీతాలు బాకాయిలు ఇవ్వకపోగా తొలగింపులకు పాల్పడుతున్నారన్నారు. వేధింపులు,తొలగింపుకు వ్యతిరేకంగా ఆగస్ట్ 5 న జరిగే కలెక్టరేట్ ధర్నాలో జిల్లాలోని స్కీం వర్కర్స్,చిరు ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పంపింగ్ స్కీమ్‌కు అధ్యక్షుల నియామకం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో లిఫ్ట్ ఇరిగేషన్ పంపింగ్ స్కీముల అధ్యక్షుల నియామకం ఏకగ్రీవంగా జరిగింది. మండలంలోని గవినివారిపాలెం ఎత్తిపోతల పథకం అధ్యక్షునిగా నక్కల లక్ష్మణ్ ఎన్నిక య్యారు. వీరిని గవిని వారిపాలెం, పిట్టువారిపాలెం, బుర్లవారిపాలెం, విజయ నగర్ కాలనీ, పచ్చమొగిలి, కీర్తివారిపాలెం, కొత్త వాడరేవు గ్రామాల రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తోటవారి పాలెం ఎత్తి పోతల పథకం అధ్యక్షునిగా రాయప్ప శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. వీరిని తోటవారి పాలెం, ఈపురుపాలెం, కాపూరి వారిపాలెం, బోయినవారి పాలెం, పుల్లాయ పాలెం గ్రామాల రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికలలో అధ్యక్షులుగా ఎన్నికైన వారికి ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య, రైతులు తదితరులు అభినందనలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

విశాలాంధ్ర - రేపల్లె : సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన చారిత్రాత్మక తీర్పునకు సంతోషం వ్యక్తం చేస్తూ రేపల్లె నియోజకవర్గంలో ఉన్న ఎంఆర్పిఎస్ ఎంఎస్పీ నాయకులు పెద్ద ఎత్తున రేపల్లె పట్టణంలో సంబరాలు జరుపుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం శాఖ మంత్రి అమిత్‌షా, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మంద కృష్ణ మాదిగ సారథ్యంలో 30 సంవత్సరాలుగా సాగుతున్న వర్గీకరణ బిల్లుకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు స్వాగతిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు పట్నంలో సంబరాలు జరుపుకున్నారు.స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వం వర్ధిల్లాలంటూ పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు ఆలూరు భిక్షాలు,బి.భాస్కర్,చక్రపాణి, కే.రవీంద్ర,ఏ.డానియేల్ ,ఎన్.కిషోర్, ఏ.సురేష్, గోపి, పి.నాగేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ బుజ్జిబాబు, పి.కోటేశ్వరరావు, బి.సత్యనారాయణ, భూషణం, కూచిపూడి రవీంద్ర ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల బహూకరణ

విశాలాంధ్ర-ఒంగోలు : డాక్టర్ చాపల వంశీ కృష్ణ సహకారంతో ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో కొత్త పట్నం గ్రామంలో విద్యాభివృద్ధికోసం పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో

భాగంగా శుక్రవారం బిఎస్ఎం జిల్లా పరిషత్ హైస్కూల్ లో - దూర ప్రాంత బాలికలు బడి మానకుండా చూడటం కోసం 120 మంది బాలికలకు ఉచిత ఆర్టీసీబస్ పాస్‌లను బహూకరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ఫొటోలతో ప్రత్యేకంగా తయారు చేసిన 500 నోటు పుస్తకాలను , సిమెంట్ బెంచ్‌లను విద్యార్థుల కోసం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ చాపల వంశీ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులందరూ మంచిగా చదువుకుని బడికి, తల్లిదండ్రులకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కొత్తపట్నం హై స్కూల్ విద్యార్థులకు ఉపాధ్యాయులకు శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉచితంగా వైద్యసేవలు అందిస్తారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, శ్రీదేవి, వెంకటేశ్వర్లు, చిరంజీవి, శ్రీరామ్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, పున్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీరాలలో త్వరలో వర్కింగ్ జర్నలిస్టుల సమావేశం

కరణంను కలిసిన జర్నలిస్టులు

విశాలాంధ్ర - చీరాల : వైద్య పరీక్షలు అనంతరం ఒంగోలు వచ్చిన చీరాల వైఎస్సార్ సీపీ ఇంచార్జి కరణం వెంకటేష్‌బాబును శుక్రవారం ఒంగోలులోని ఆయన నివాసంలో చీరాల వర్కింగ్ జర్నలిస్టులు కలిసి పరామర్శించారు. అనంతరం చీరాలలోని ప్రజా సమస్యలు గురించి,జర్నలిస్టుల సమస్యలపై సీనియర్ రాజకీయ నాయకులు కరణం బలరామ కృష్ణమూర్తిని కలిసి చర్చించారు. సమస్యల పరిష్కారం విషయంలో అందరం కలిసి సమన్వయంతో కృషి చేద్దామని తెలిపారు. బలరాం, వెంకటేష్‌లను కలిసిన వారిలో విశాలాంధ్ర దిన పత్రిక ప్రతినిధులు గుమ్మడి సూర్య ప్రకాష్, గుడిమోటి అశోక్ కుమార్,మీడియా కో- ఆర్డినేటర్, మినిస్టర్స్, సెక్రెటరీస్ పేషీ యన్.నాగార్జున,ప్రజాప్రతిభ ప్రతినిధి మణికంఠ, క్యాపిటల్ వాయిస్ దిన

పత్రిక ప్రతినిధి కోటేశ్వరరావు, డిక్కన్ క్రానికల్ టైమ్స్ రాంబాబు, 6టీవీ దుర్గాప్రసాద్, మన తెలుగు టీవీ సాంబ శివరావు తదితరులు ఉన్నారు.

త్వరలో చీరాలలో వర్కింగ్ జర్నలిస్ట్ సమావేశం : వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలపై శుక్రవారం జరిగిన సమావేశంలో బాపట్ల,ప్రకాశం జిల్లాల ఉమ్మడి జర్నలిస్టుల సదస్సు చీరాలలో నిర్వహించాలని జరిగిన నిర్ణయం మేరకు సన్నాహక సమావేశం త్వరలో రెండు జిల్లాల ప్రతినిధులతో ఒంగోలులో జరుగుతుందని వర్కింగ్ జర్నలిస్ట్ ప్రతినిధి నాగార్జున తెలిపారు. గతంలో చీరాల 1వపట్టణ సీఐగా విధులు నిర్వహించి ఇతర జిల్లాకు బదిలీపై వెళ్లా జర్నలిస్టుల సంక్షేమం కోసం విరాళంగా ఇచ్చిన రూ.30వేలు విషయం, గత 20 సంవత్సరాలలో చీరాల నియో జకవర్గం లో జర్నలిస్టు కోటాలో ఇళ్లస్థలాలు పొందిన లబ్దిదారులందరి జాబితాను రెవెన్యూ అధి కారుల నుండి సేకరించాలని, జర్నలిస్టుల కుటుంబాల విద్యార్థులకు స్కూలు, కళాశాలలో రాయితీ విషయమై కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వాలని, నియోజకవర్గంలోని వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ స్థలం మంజూరు కోసం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వాలని తీర్మానించుకున్నట్లు నాగార్జున మీడియాకు తెలిపారు.

కౌలు రైతులందరికీ వ్యవసాయ రుణాలు

విశాలాంధ్ర - అద్దంకి : కౌలు రైతులు అందరికి వ్యవసాయ రుణాలు అందించాలని వ్యవసాయాధికారి వై.రామకృష్ణ బ్యాంకర్లను కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్యాంకర్ల మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కౌలు కార్డు ఉన్న ప్రతి రైతుకు పంట రుణం మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలో 10 వేల కౌలు గుర్తింపు కార్డులు అందించామని అర్హత ఉన్న ప్రతి రైతుకు పంట రుణం మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ,ఏడిఏ కె.ధనరాజ్, మార్టూరు ఏడిఏ శ్రీనివాసరావు అద్దంకి మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, బల్లికురవ వ్యవసాయాధికారి కుమారి,సంతమాగులూరు వ్యవసాయాధికారి లావణ్య, కొరిశపాడు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, పంగులూరు వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, అన్ని బ్యాంకల మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - రేపల్లె : సుప్రీం కోర్టు ధర్మా సనం ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా తీర్పు వెలువరించిన సందర్భంగా శుక్రవారం బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గుడిసె దేవానంద్ ఆదేశానుసారం రేపల్లె తాలూకా ఆఫీసు సెంటర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బేతపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షులు అన్నం సాయి వరప్రసాద్, నాయకులు కిషోర్ రాంప్రసాద్, సురేష్ ,కృష్ణ ప్రసాద్ ,పిన్ని సాంబశివరావు, కె.చిన్న రామాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర - కర్లపాలెం : మండల పరిధిలోని పేరలి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలు ప్రాధాన్యత గురించి గర్భవతులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క తల్లి వారి బిడ్డలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, డబ్బా పాలు ఇవ్వకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ అభివృద్ధికి కృషి చేద్దాం

విశాలాంధ్ర - కర్లపాలెం : రెడ్‌క్రాస్ సొసైటీ ఆశయ సాధనకు కృషి చేద్దామని తహశీల్దార్ మండల రెడ్‌క్రాస్ అధ్యక్షులు ఎస్. వెంకట రత్నం అన్నారు. శుక్రవారం నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్‌ని మండల రెడ్ క్రాస్ యూనిట్ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అధిక సభ్యులు చేర్పించి సేవా కార్యక్రమాల్ని ముందుకు తీసుకెళ్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెడ్ క్రాస్ యూనిట్ చైర్మన్ ఈ పోలీసు రావు, ఏం.పరమానంద కుమార్, పి.ధనుంజయ్, బి.రాజేష్, జి.వెంకటరెడ్డి, పి.వెంకట్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలి

విశాలాంధ్ర - బాపట్ల : విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలని, జీవితంలో ఉన్నత స్థితికి ఎదిగి మంచి పేరు సంపాదించుకోవాలని యంగ్ మెన్ వైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు నాళం నరేష్ అన్నారు. ఈ సందర్భంగా నాళం నరేష్ ఆధ్వర్యంలో ఇస్లాం పేటలో అజాద్ ఎలిమెంటరీ స్కూల్ లో విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు, జామెంట్రీ బాక్సు, ఎగ్జామినేషన్ పేపర్స్‌ను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి ఎస్.నిరంజన్ విద్యార్థులకు అందజేశారు. అనంతరం నాళం నరేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులకు నా సహాయ సహకారాలు ఉంటాయ న్నారు. తల్లిదండ్రులు, గురువులతో వినయత కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు, శివరామకృష్ణ, మారం మణి, బొమ్మ శెట్టి వెంకట శివ వరప్రసాద్, ఇమ్మడి శెట్టి రాము, వీర్రాజు, సుజిత్, పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ బాపట్ల జిల్లా రేపల్లె మున్సిపాలిటీ 4వ వార్డు కాపురస్తురాలు నిజాంపట్నం **వెంకటేశ్వరరావు** గారి భార్య నిజాంపట్నం **శ్రీనివాస శశి కుమారి** యావన్మందికి తెలియజేయు సమాచారం. నా క్లయింట్ నిజాంపట్నం శ్రీనివాస శశి కుమారి రేపల్లె సబ్ రిజిస్టర్ వారి ఆఫీసులో రిజిస్టర్ కాబడిన దాఖలు దస్తావేజు నెంబర్ **42/2020** మరియు భాగ పంపిణీ దస్తావేజు నెం.**5599/2019**ను కలవు. సదరు పైన తెలిపిన రెండు దస్తావేజులు నేను ఇల్లు మారుతున్న పుడు ఎక్కడో పోయినవి. ఎంత వెతికినను దొరకలేదు. ఇది యదార్థము. పై విషయ ములన్నియు యదార్థములు అట్లు కానీ యెడల ప్రభుత్వం వారు నాపై తీసుకుని సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు నేను పూర్తి బాధ్యత వహించగలదానను.

ఇట్లు
శ్రీనివాస శశికుమారి, 4వ వార్డు, రేపల్లె

సేరు శ్రీనివాసరావు
అడ్వకేట్, రేపల్లె, బాపట్ల జిల్లా

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-మద్దిపూడి : విద్యార్థులు సీజనల్ వ్యాధులపై తగిన అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని కాకర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారిని డాక్టర్ సాయిరిషిత అన్నారు. మద్దిపూడి మండలం కాకర్ల గ్రామంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్లో కాకర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆరోగ్యంపై అవగాహన సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసిన డాక్టర్ సాయి రిషిత మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులైన మలేరియా డెంగ్యూ డయేరియా పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం సర్వే జరుగుతున్న లెప్రసీ వ్యాధి గురించి హ్యాండ్ వాష్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాకర్ల వైద్యాధికారి డాక్టర్ సాయి రిషితతో పాటు సాంఘిక సంక్షేమ సంక్షేమ వసతి గృహం అధికారి హరి బాబు, ఎంపీ ఈహెచ్ఓ ఏడుకొండల రావు, ఫార్మసిస్ట్ శ్రీనివాసరావు, సూపర్వైజర్ శ్రీకాంత్, ఏఎన్ఎం శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు మార్తమ్మ, సాంఘిక సంక్షేమ హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇందిరా కాలనీలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - పర్చూరు : స్థానిక కోర్టు పరిధిలోని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా కాలనీలో సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండ వైద్య శిబిరంను శనివారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేస్తున్నామని సీనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి ప్రకటనలో శుక్రవారం తెలిపారు. వ్యాధులపై అవగాహనకు సదస్సు జరుగుతుందని, ప్రజలు హాజరు కావాలని న్యాయమూర్తి ప్రశాంతి కోరారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇరువురికి గాయాలు

విశాలాంధ్ర - కొల్లూరు : ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో చోటుచేసుకున్న ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు తీవ్ర గాయాలకు గురైన సంఘటన కొల్లూరు కరకట్ట వద్ద జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన కోటి, లాజరు అనే ఇరువురు వ్యక్తులు స్కూటీపై రేపల్లె సమీపంలోని చేపల చెరువుల వద్దకు వెళుతుండగా కొల్లూరు సమీపంలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి రోడ్డు అంచుల కిందకు దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇరువురు కింద పడటంతో గాయాల పాలయ్యారు. 108 వాహనంలో స్థానికులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మాజీ సర్పంచ్ పెద్దయోగి మృతి

విశాలాంధ్ర-మద్దిపూడి : మండల కేంద్రమైన మద్దిపూడి మాజీ సర్పంచ్ గుంటు పెద్దయోగిరెడ్డి గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారని ఆయన కుమారుడు గొంటు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. యోగి రెడ్డి 1987వ సంవత్సరంలో సర్పంచ్‌గా గెలుపొందారు. రెడ్డి మరణం తీరని లోటని ప్రముఖులు వ్యక్తపరిచారు. అందరినీ పలకరిస్తూ కుల మత భేదాలు లేకుండా సోదరి బావంతో మెలిగే వ్యక్తి యోగిరెడ్డి అంటూ గ్రామస్తులు ప్రశంసలు కురిపించారు.

సూర్యలంక బీచ్‌లో మునిగిపోతున్న యువకుడిని రక్షించిన పోలీసులు

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలోని సూర్యలంక బీచ్‌లో శుక్రవారం అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతున్న అచ్యుత్ మహేష్ అనే వ్యక్తిని సూర్యలంక అవుట్ పోస్ట్‌లో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది,గజ ఈతగాళ్లు ప్రాణాలకు తెగించి కాపాడారు.వివరాలలోకి వెళితే బాపట్ల పట్టణం న్యూ షరాఫ్ బజార్‌కు చెందిన అచ్యుత్ మహేష్ స్నేహితులతో కలిసి సూర్యలంక బీచ్‌కు విహారానికి వచ్చారు.అచ్యుత్ మహేష్ ఎక్కువ లోతుకు వెళ్లి మునుగుతూ ఉండగా ఇంతలో ఒక్కసారిగా వచ్చిన పెద్ద అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకుపోతుండడంతో అది గమనించిన ఔట్ పోస్ట్ పోలీస్ సిబ్బంది,గజ ఈతగాళ్లు వెంటనే తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సముద్రంలోకి వెళ్లి వ్యక్తి ప్రాణాలు కాపాడి ఒడ్డుకు తీసుకొని వచ్చారు.తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా యాత్రికుడి ప్రాణాలు కాపాడిన పోలీస్ సిబ్బందిని,గజ ఈతగాళ్లను,యాత్రికుల రక్షణ కోసం పటిష్ట భద్రతాపరమైన చర్యలు తీసుకున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడిని యాత్రికులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యాత్రికుల రక్షణ కొరకు సూర్యలంక సముద్ర తీరంలో పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు.సముద్రం తీరం వెంబడి గజ ఈతగాళ్లను నియమించామన్నారు. సముద్రంలో నిర్దిష్ట లోతులో ఎరుపు రంగు జెండాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యాత్రికులు వాటిని దాటి సముద్రంలోకి వెళ్ళరాదన్నారు.అడ్రసింగ్ సిస్టం ద్వారా సముద్రంలో లోతుకు వెళుతున్న యాత్రికులను పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూ అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. పోలీస్ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని యాత్రికులు నిర్దిష్ట లోతులో మాత్రమే మునగాలని ప్రజలకు సూచించారు. పోలీస్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను జిల్లా ఎస్పీ అభినందించారు.

తల్లిపాలు అమృతంతో సమానం

విశాలాంధ్ర - నిజాంపట్నం : తల్లిపాలు అమృతంతో సమానమని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్ వైజర్ మురళి తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కూచినపూడి పంచాయతీ పరిధిలోని కర్రావారిపాలెం అంగన్వాడీ కేంద్రం ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన మురళి మాట్లాడుతూ తల్లిపాలు సహజ సమతుల్య ఆహారమని, రోగ నిరోధక వ్యవస్థ మెరుగు పడుతుందని చెప్పారు. వీటిద్వారా శక్తితోపాటు ఎన్నో విలువైన పోషకాలు బిడ్డకు అందుతాయన్నారు.బిడ్డకు తన పాలు ఇవ్వడం వల్ల తల్లికి కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ విజయ సుశీల, ఆశా వర్కర్ వరలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-తర్లుపాడు : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్ర మైన తర్లుపాడు లోని స్థానిక ఎస్సీ కాలనీ లోని అంగన్వాడి కేంద్రంలో మార్కాపురండివిజన్ ప్రాజెక్టు సిడిపిఓ పి సుశీల ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు పిల్లల తల్లిదండ్రులతో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ సిడిపిఓసుశీల మాట్లాడుతూ ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు సుమారు 6 రోజులపాటు తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తల్లి పిల్లను నవమాసాలు మోసి ప్రసవించిన వెంటనే బిడ్డకు అందజేసే ఆహారం తల్లిపాలేన న్నారు. స్త్రీ గర్భం దాల్చిన తర్వాత, బాలింతప్పుడు ఎలాంటి పోషక పదార్థాలు తీసుకోవాలో తగిన సూచనలు తెలియజేశారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపడం శ్రేష్టమన్నారు. తల్లిపాలు పుష్కలంగా ఉన్న ఎడల అలాంటి బిడ్డలకుఎలాంటి రోగాలు సంభవించవన్నారు. పిల్లల పట్ల తల్లులు తగిన జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ర్లుప్లవేణి, సిహెచ్ తులసి ప్రసాద్, ఏ ఎన్ ఎంలు నాగేశ్వరమ్మ, రాధా, అంగన్వాడి కార్యకర్తలు లలిత,ఆశావర్కర్లు,నాగమణి, పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న శ్రీనివాసరావు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని వేముల గ్రామానికి చెందిన దేవ వరపు శ్రీనివాస రావు తమిళనాడు రాష్ట్రంలోని అన్నామలై విశ్వ విద్యాలయం నుండి శుక్రవారం డాక్టరేట్ అందుకున్నారు. వేముల గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు స్వర్గీయ దేవవరపు వెంకటేశ్వర్లు కుమారుడు శ్రీనివాసరావుకు అన్నామలై విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా డాక్టరేట్ ఎస్అనుహెచ్ నాయర్ పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో వివిధ అభ్యసన నమూనాలను ఉపయోగించి న్యూ మేనియా వర్గీకరణ కోసం ఆటో మేటెడ్ సిస్టమును అభివృద్ధి చేశారు. ప్రస్తుతం హైదరాబాదులోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నాడు. డాక్టరేట్ సాధించిన దేవవరపు శ్రీనివాసరావును మండలంలోని పలు ఉపాధ్యాయులు బంధువులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందించిన సచివాలయ ఉద్యోగి

విశాలాంధ్ర - పీసీపల్లి : మండలంలోని పెదఅలవలపాడు గ్రామానికి చెందిన పువ్వాడి నాగేశ్వరరావు అనారోగ్యంతో కందుకూరు ముప్పాల రోశయ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ నాయకులు పువ్వాడి నాగరాజు చొరవతో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ కిరణ్ కందుకూరు వెళ్లి చికిత్స పొందుతున్న నాగేశ్వరరావుకు పెన్షన్ అందజేసి ఉదారత చాటుకున్నారు. ఈ క్రమంలో సచివాలయ ఉద్యోగికి తెలుగుదేశం పార్టీ నాయకులు పువ్వాడి నాగరాజు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేయగా గ్రామస్థులు అభినందించారు.

యూనియన్ బ్యాంకులో చోరీ యత్నం

విశాలాంధ్ర-త్రిపురాంతకం : మండలంలోని మేడపీ గ్రామంలోని యూనియన్ బ్యాంక్‌లో చోరీ చేసే ప్రయత్నం జరిగింది. శుక్ర వారం రోజులాగానే యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు తమ విధులకు హాజరు అయ్యారు. అక్కడ పని చేసే ఒక ఉద్యోగి లోకర్ తెరిసేందుకు దగ్గరకు వెళ్ళగా ఒక తాళం కనిపించింది. దీనితో ఆశ్చర్యానికి గురైన బ్యాంక్ ఉద్యోగులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. బ్యాంక్ మేనేజర్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన యస్ఐ సాంబశివయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం తమ ఉన్నత అధికారులకు సమాచారం అందించారు. దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వేలి ముద్ర సేకరణ బృందం సీఐ శరత్ బాబు ఆధ్వర్యంలో వేలిముద్రలు సేకరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి ఒక గుర్తు తెలియని మహిళ వెనుక వైపు వున్న గోడ దాటి బ్యాంక్ ఆవరణ లోకి ప్రవేశించింది. తూర్పువైపు వున్న ఇనుప షటర్ తలుపునకు వున్న తాళం పగుల గొట్టి బ్యాంక్ లోపలికి ప్రవేశించి బ్యాంక్ సీక్రెట్ లాకర్ వద్దకు వెళ్లి తనవద్ద వున్న తాళాలతో సీక్రెట్ లాకర్ తాళం తీసేందుకు ప్రయత్నించింది. అయినప్పటికీ రాకపోవడంతో వెనుదిరిగింది.

ఆ మహిళ సుమారుగా బ్యాంక్ లోపల 4గంటల వుండటం గమనార్హం. గ్రామస్తులను, రోడ్డు వైపు వున్న దుకాణాల సీసీ కెమెరాల దృశ్యాలు సేకరించారు. అందులో బ్యాంక్‌లో అపహరణకు వెళ్లిన మహిళ ఆన వాలు వున్న వ్యక్తితో పాటు మరొక వ్యక్తి వున్నట్లు గుర్తించారు. త్వరలోనే అపహరణకు పాల్పడిన వారిని పట్టుకుంటానని పోలీసులు తెలిపారు.

NOTICE

IN THE COURT OF THE HON'BLE II ADDL. DIST. JUDGE::GUNTUR
M.V.O.P No. 1258 / 2022

Between :
Jampani Venkateswara Rao & Another. ...Petitioners
And
Andhra Pradesh State Road Transport Corporation, Rep. by its Regional Manager& Another. ...Respondents
To,
R-2:Kodala Kondaiah, S/o. Kondaiah, Driver of the RTC Bus bearing No: AP 0 Z 2279, Repalle Depot,Now Bapatla Dist.

పై నెంబరు O.P.ని పిటీషనర్లు యాక్సిడెంటుకు నష్టపరిహారము కోరుచూ దాఖలుచేయగా సదరు పిటీషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:21-08-2024కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకుగల అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టువారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)
వాయిదా తేది:21-08-2024

కె. శివ ప్రసాద్, పిటీషనర్ల తరపు అడ్వకేట్, గుంటూరు, సెల్: 9848119447

నేడు మాజీ ఎమ్మెల్యే కోన జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల : మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి జన్మదిన వేడుకలు శనివారం పట్టణంలోని కోన ఛాంబర్‌లో శనివారం నిర్వహిం చనున్నట్లు వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు తెలిపారు. శని వారం ఉదయం 9 గంటలకు పార్టీ నాయకులు, వైసీపీ అనుబంధ ప్రజాప్రతినిధులు కోన జన్మదిన వేడుకలు హాజరు కావాలని కోరారు.

గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : వర్షాలు పడుతున్న కారణంగా సీజనల్,అంటూ వ్యాధులు ప్రబల కుండా గ్రామంలో పక్కగా పారి శుద్ధ్య పనుల చేపట్టాలని తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు బొమ్మిడి రామకృష్ణ కోరారు.ఈ మేరకు శుక్రవారం నిజాంపట్నం పం చాయతీ కార్యాలయాన్ని అయన సందర్శించి సెక్రెటరీ ప్రసాద్‌తో మాట్లా డారు. వర్షాలు కురుస్తున్న కారణంగా రహదారులపై వర్షపు నీరు నిలవ కుండా చర్యలు చేపట్టాలని చెప్పారు.వర్షపు నీరు నిలిచిన ప్రదేశాల్లో దోమలు,ఈగలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ ను చల్లాలని చెప్పారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామంలో పక్కగా పారిశుద్ధ్య పనులు చేపడతామని సెక్రెటరీ ప్రసాద్ అయనతో చెప్పారు.

సీఐగా హజరత్తయ్య బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - సింగరాయకొండ : సింగరాయకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా హజరత్తయ్య శుక్రవారం సర్కిల్ ఇన్ స్పెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీక రించారు. గతంలో సింగరాయ కొండ సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిం చారు. ప్రధానంగా సర్కిల్లోని ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తానని వాహనదా రులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు. పోలీస్ సిబ్బంది సీఐకు శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయవాదులకు ఆదర్శం కొప్పలి సుబ్బారాయుడు

విశాలాంధ్ర-ఒంగోలు : సీనియర్ న్యాయవాది కీర్తిశేషులు కొప్పలి సుబ్బరాయుడు న్యాయవాదులకు ఆదర్శప్రాయుడని న్యాయవాది, కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్, ఏజిపి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి సీనియర్ న్యాయవాది చింతకుంట్ల సాల్మన్ రాజు అన్నారు. శుక్రవారం కని గిరి బార్ అసోసియేషన్ కార్యాలయంలో కొప్పల్లి సుబ్బారాయుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా కెఎస్ ఆర్ లా అసోసియేట్స్ ఆధ్వర్యంలో అందజేసిన హెల్మెట్లను కోర్టు సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ కొప్పలి సుబ్బారాయుడు జ్ఞాపకాలను, వృత్తి పట్ల నిబద్ధతను, కేసును వాదించే విధానాన్ని నేర్చుకున్నామని తెలిపారు. ప్రేమ ఆప్యాయత కొప్పలి సుబ్బరాయుడు సొంతమని, న్యాయవాదులకు సలహాలు సూచనలు ఇస్తూ కేసుల్ని వాదించడంలో నిష్ణాతుడిగా పేరు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సూపరిటెండెంట్ నాగిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్చాల ఆది నరసారెడ్డి, యరజాల బాల నారా యణ, బలసాని మోహన్, అచ్యుత సుబ్బారావు, బుర్రి శ్రీనివాసులు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాశం పిచ్చయ్య,వలి, షాహిద్, శేఖర్, రబ్బా ని బాలిరెడ్డి, బాలాజీ, చంద్రబోస్, ఎం విద్యా యాదవ్, ఎం చంద్ర బాబు, రామ సుబ్బారెడ్డి , నాయబ్ రసూల్ చింతకుంట్ల కిషోర్, చంద్ర, ముక్కు శైలజా రెడ్డి, మాజీ రాష్ట్ర లాయర్ల గుమస్తా సంఘం అధ్యక్షుడు సయ్యద్ యాసిన్, లాయర్ల గుమస్తాలు ఎస్ ఎన్ రసూల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర - ఒంగోలు : జూలై 1 2024 నుండి భారత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన కొత్త నేర చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఓపిడిఆర్, ప్రజాతంత్ర మేధావుల వేదిక డిమాండ్ చేశాయి. స్థానిక ఈమనిపాలెం తరిమెల నాగిరెడ్డి భవన్ లో కొత్త నేర చట్టాలను నిరసిస్తూ జరిగిన సభలో ప్రజాతంత్ర మేధావుల వేదిక కన్వీనర్, ప్రముఖ న్యాయవాది పంగులూరి గోవిందయ్య మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంల పేరిట వచ్చిన చట్టాలు ప్రజల హక్కులకు, ముఖ్యంగా శ్రామిక, బలహీన వర్గాల ప్రజల హక్కులకు తీవ్ర విఘాతం కలిగించ బోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక మంది న్యాయ నిపుణులు వీటిని పాత సీసాలో కొత్త సారాగా వర్ణిస్తున్నప్పటికీ, న్యాయ, సురక్ష లాంటి పేర్ల చాటున పాలకులు పాత చట్టాలకు తెచ్చిన కొద్దిపాటి మార్పులే ప్రజలకు ముప్పుగా మారాయని, ఇలాంటి చట్టాలకు వ్యతిరేకంగా

ప్రజాతంత్రవాదులందరూ గళం విప్పాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సభలో ఏఐఎఫ్‌టియూ (న్యూ) రాష్ట్ర కోశాధికారి కామ్రేడ్ డివిఎన్ స్వామి మాట్లాడుతూ భారతీయత పేరుతో తెచ్చిన ఈ చట్టాలు ప్రజా ఉద్యమాలకు, ప్రజల హక్కులకు భంగం కలిగిస్తుండగా, ఆరెస్సెస్ మతోన్మాద, హింసాత్మక కార్యకలాపాలకు చట్ట బద్ధత కల్పించే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయ వర్గాలలో కానీ, పార్లమెంటులో కానీ, కనీసం పార్లమెంటరీ స్టాం డింగ్ కమిటీలో కానీ కనీస పాటి చర్చ లేకుండా తెచ్చిన ఈ ఫాసిస్టు చట్టాలను వ్యతిరేకించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అరెస్టు, విచారణ, కేసు నమోదు, సోదా లాంటి అనేక విష యాల్లో ప్రజల హక్కులను కుది స్తూ, పోలీసు వ్యవస్థకు అసాధారణ అధి కారాలను ఇవ్వడం దేశాన్ని పోలీస్ రాజ్యంగా మార్చే కుట్రలో భాగమే నని ఆయన అభిప్రాయపడ్డారు. ఓపిడిఆర్ జిల్లా నాయకులు కామ్రేడ్ పి.సుబ్బారావు అధ్యక్షత వహించిన ఈ సభలో, ఓపిడిఆర్ నాయకులు కత్తి పేరయ్య, ప్రజాతంత్ర మేధావుల వేదిక నాయకులు కామ్రేడ్ కె. సుబ్బా రావు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎస్.లలిత కుమారి, ఏఐఎఫ్‌టియూ (న్యూ) నాయకులు కామ్రేడ్స్ ఎంఎస్ సాయి, ఐ.విజయసారధి పాల్గొన్నారు.

సమాజ సేవ చేయడం ఆదర్శనీయం

విశాలాంధ్ర - ఒంగోలు : దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో ఒంగోలు హౌసింగ్ బోర్డ్ లోని బొమ్మరిల్లు అనాధ పిల్లలకు నోట్ బుక్స్ పండ్లు కాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూరజ్ పుట్టినరోజు చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహబూబ్ మాట్లాడుతూ పుట్టిన రోజున ఆడంబరాలకు పోకుండా ఇలా సమాజ సేవ చేయడం ఆదర్శనీయం అన్నారు. ఆకలిగొన్నవారికి పట్టెడన్నం పెట్టి వారి కళ్ళల్లో ఆనందం చూడటం ఎనలేని సంతోషాన్ని కలిగించిందని , మా మనవడు నూరజ్ పుట్టినరోజు మీ అందరి మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. పేద విద్యార్థులకు తమ వంతుగా సహకారం అంది స్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్య క్షుడు మారెళ్ళ సుబ్బారావు, నత్తల శ్రీనివాసరావు, గొల్లపూడి రవి, బొమ్మరిల్లు నిర్వాహకులు ఖాసీం, రాజ్యలక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రావణమాస కార్యక్రమాలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - రేపల్లె : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో శ్రావణ మాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు శు క్రవారం తెలిపారు. రేపల్లె ఒకటో వార్డు సీతారామాలయంలో మండల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ ఆగస్టు 19 తేదీ శ్రావణ పౌర్ణమి సంద ర్భంగా రక్షా బంధనం కార్యక్రమం నిర్వహించాలని,అనుబంధాల రక్షణ కోసం హిందూ ధర్మ రక్షణ కోసం ధర్మ రక్షాబంధన్ కార్యక్రమం19వ తేదీ నుండి 22వ వరకు గ్రామా లలో నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ధార్మిక సమితులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.ఆగస్టు 5వ తేదీ తులసీదాస్ జయంతి హనుమాన్ చాలీసా పారాయణం,10వ తేదీ రెండవ శనివారం సత్సంగములు బాలవికాస్ శిక్షణ తరగతి నిర్వహించాలని,ఈనెల 15,29వ తేదీలలో ఏకాదశి నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి మండల కన్వీ నర్ బేరం కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో గూడవల్లి కుటుంబ రావు, నంబూరు వేణు,రమాదేవి,ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా శివయ్య కళ్యాణం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఆషాఢ మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా స్థానిక నల్ల గాంధీ బొమ్మ కూడలి వద్ద ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వారి కళ్యాణాన్ని అంగ రంగ వైభవంగా నిర్వహించారు.ఆలయంలోని ప్రత్యేక మంటపంలోకి స్వామి వారిని, దేవేరులను వేంచేపు చేసి సుమంగళ వాయిద్యాల మధ్య, వేదోక్త మంత్రోచ్చారణలతో శివయ్య కళ్యాణం అంగరంగ వైభోగంగా ఆలయ అర్చక స్వాములు దివాకర శర్మ, భాస్కర శర్మలు నిర్వహించారు.

పోస్టల్ బాధితులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - రేపల్లె : సిరిపూడి పోస్టల్ బాధితులకు న్యాయంజరిగేలా చూడాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కార్యాలయంలో వినతిపత్రం బాధితులు అందజేశారు. మోసపోయిన పోస్టల్ ఖాతాదారులు సిరిపూడి పోస్టల్ బాధితుల పోరాట కమిటీగా గత కొన్ని రోజులుగా జరుగుతున్న దశల వారి ఆందోళనలో భాగంగా శుక్రవారం అనగాని సత్యప్రసాద్ కార్యాలయంలో అనగాని శివప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిరిపూడి పోస్టల్ బాధితుల పోరాట కమిటీ గౌరవాధ్యక్షులు సిహెచ్.మణిలాల్ మాట్లా డుతూ పోస్టల్ ఖాతాదారులుని మోసంచేసిన నింది తుడు ఒడుగు గోపి మనోజ్ వర్మకు పోస్టల్ శాఖలో కొంతమంది సిబ్బంది,అతని కుటుంబసభ్యులు సహకారం కూడా ఉన్నది, కావున దీనిలో భాగ స్వామ్యం అయినా అందరి మీదా క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయస్థానం ముందు



లొంగిపోయిన నిందితుడిని పోలీస్ కస్టడీకి తీసు కుని బాధితులకు తిరిగి డబ్బులు చెల్లించేలాగా చూడాలన్నారు. అదేవిధంగా కొంతమంది ఖాతా దారులకు ఎటువంటి పాస్ పుస్తకాలు లేకపోవ టంతో డబ్బులు రావేమో అని ఆందోళన వారికి ఈప్రాంత ప్రజా ప్రతినిధిగా మంత్రి అనగాని సత్య ప్రసాద్ భరోసా కల్పిస్తు జిల్లా అధికార యంత్రాం గాన్ని ఆదేశించి డబ్బులు కట్టి మోసపోయిన ప్రతి ఖాతాదారుడికి వారి పాస్ పుస్త కాలు తిరిగే అందజేసేలాగా చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అనగాని శివ ప్రసాద్ స్పందిస్తూ అధికార యంత్రాంగం,పోలీస్ శాఖ ద్వారా మోసపోయిన బాధితు లకు న్యాయం జరిగేలాగా కృషి చేస్తామని బాధితులకు భరోసా కల్పించి నేరుగా రేపల్లె రూరల్ సీఐ మల్లికార్జున రావుకి బాధితుల సమస్యను మాట్లాడించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిరిపూడి పోస్టల్ బాధితుల పోరాట కమిటీ అధ్యక్షులు ఏ.కోటేశ్వర రావు, కమిటీ సభ్యులు కె.సాల్మన్ రాజు, సికె.నాగేశ్వరరావు, ఉ.మల్లేశ్వరి, ఎల్.వెంకటేశ్వ రమ్మ, పి.శివపార్వతి, పి.బాపమ్మ తదితరులు పాల్గొన్నారు.